## క్లుప్తంగా

### పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

● డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ క్రైం:** రాబోయే అన్ని పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన శాంతి కమిటీ సమావేశంలో అన్నిమత, కుల పెద్దలతో డీఎస్పీ మాట్లాడారు. రంజాన్, ఉగాది ఇతర పండుగలను సంతోషంగా జరుపుకోవాలని, పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఎస్ఐలు శీనయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### రేవా హోటల్ సీజ్

● రూ.70లక్షలు అద్దె బకాయి



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక బస్టాండ్ సమీపంలోని 18 మున్సిపల్ షాపులను అద్దెకు తీసుకొని కొన్ని నెలలుగా చెల్లించకపోవడంతో అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఇందులో మొత్తం రేవా హోటలే కొనసాగుతుండగా యాజమాన్యం సుమారు రూ.70 లక్షల బకాయి పడింది. పలుసార్లు నోటీసులు అందజేసినా స్పందించక పోవడంతో చివరికి అన్ని షట్టర్లకు తాళం వేశారు. ఇక క్లాక్‌టవర్‌లో వారం రోజుల క్రితం సీజ్ చేసిన 40 దుకాణాల్లో 35మంది తాజాగా రూ.30,53,351 చెల్లించడంతో వాటిని తెరవడానికి అనుమతి నిచ్చారు. ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐలు రమేష్, పెంటయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఆధార్ కేంద్రం ఏర్పాటు

**నవాబుపేట:** స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యార్థులకు సంబంధించి ఆధార్ కరెక్షన్ కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగ్యానాయక్ తెలిపారు. సోమవారం ఆయన ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి చిన్నచిన్న తప్పుల విషయంలో ఆధార్ కేంద్రాల్లో రోజుల తరబడి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. అందుకే ప్రభుత్వం ద్వారా మండల విద్యాశాఖ కార్యాలయంలోనే ఈకేంద్రం ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. జీహెచ్‌ఎం దశరథ్‌నాయక్, సీఆర్‌పీలు జనార్దన్, గోపాల్ తదితరులు ఉన్నారు.

### ఫర్నిచర్ అందజేత

**నవాబుపేట:** మండలంలోని యన్మన్‌గండ్ల జెడ్పీ పాఠశాలకు పూర్వవిద్యార్థుల బృందం రూ.20వేల ఫర్నిచర్ అందించింది. ఈ పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు సోమవారం రూ.20వేల బీరువాను అందించారు. పూర్వవిద్యార్థులు కృష్ణగౌడ్, నర్సింహులు, వెంకట్రాములు, చెన్నయ్య తదితరులున్నారు.

### చెత్త తొలగింపు

**జడ్చర్ల టౌన్:** పట్టణంలోని డిగ్రీ, పీజీ కళాశాలలో ఉన్న బొటానికల్ గార్డెన్‌లో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో 'స్వచ్ఛ తాహిసేవ' నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా.సదాశివయ్య ఆధ్వర్యంలో 50మంది వాలంటీర్లు పాల్గొని గార్డెన్‌లోని వివిధ విభాగాల్లో చెత్తను తొలగించారు. చెత్తను కంపోస్ట్ తయారీకి ఉపయోగించేందుకు సిద్ధంచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య మాట్లాడుతూ పిల్లల్లో పర్యావరణ స్పృహ తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులు వారానికి ఒక గంట సమయాన్ని పరిసరాల పరిశుభ్రతకు కేటాయించాలన్నారు.

### వాటర్ ఫిల్టర్ విరాళం

**మిడ్జిల్:** స్థానిక ఉన్నతపాఠశాలకు పూర్వ విద్యార్థిని, మానవతా ఫౌండేషన్ అధ్యక్షురాలు డా.రమ్యసౌజన్య రూ.80 వేల విలువ గల వాటర్ ఫిల్టర్‌ను విరాళంగా ఇచ్చారు. ఆఫిల్టర్‌ను సోమవారం ప్రారంభించారు. నిరుపేద విద్యార్థుల కోసం ముందుకు వచ్చి వాటర్ ఫిల్టర్ విరాళంగా ఇవ్వడంతో గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం సరస్వతి, నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు రాధిక, నారన్‌రెడ్డి, సంపత్, గౌస్, పర్వతాలు, ఉస్మాన్ పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య తీర్చాలి

**మిడ్జిల్:** మండలంలోని మల్లర్లబావితండాలో తాగునీటి సమస్య తీర్చాలని తండావాసులు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీఓ గీతాంజలికి వినతి పత్రం ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తండావాసులు నరేష్, శంకర్, విష్ణు తదితరులు ఉన్నారు.

### మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ

**మిడ్జిల్:** స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ సుధాకర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనాలు, గుడ్లు కూడా క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జానకమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక మాసన్న దర్గా

● నేటి నుంచి ఉర్సు
● మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు
● వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
● ఉర్సుకు అన్ని ఏర్పాట్లుచేసిన నిర్వాహకులు



విద్యుత్ దీపాలతో అలంకరించిన అబ్దుల్ రహిమాన్ దర్గా

**చిన్నచింతకుంట:** మత సామరస్యానికి ప్రతీకగా అబ్దుల్ రహిమాన్(మాసన్న) దర్గా బాసిల్లుతోంది. కొకుంట్ల మండలం అప్పంపల్లిలో వెలిసిన మాసన్న దర్గా ఉర్సు కులమతాలకు అతీతంగా మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగనుంది. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలకు ఉమ్మడి పాలమూర్ జిల్లాతో పాటు హైదరాబాద్, వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు. అందుకు సంబంధించి దర్గా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దర్గాకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, తాగునీటి, పారిశుధ్యం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు.

**ఉర్సు కార్యక్రమాలు..**

18వ తేదీ మంగళవారం గ్రామంలోని దర్గా నిర్వాహకులు జి.శంకర్ ఇంటి నుంచి కిలోమీటర్ దారిపొడవునా మేళతాళాల మధ్య గంధంను ఊరేగింపుగా తీసుకువస్తారు. గంధాన్ని తాకేందుకు భక్తులు పోటీపడతారు.

● 19వ తేదీ బుధవారం చిరాగ్(దీపాలంకరణ)ను పురస్కరించుకొని దర్గాలో దీపాలు, కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం బాణసంచా పేలుస్తారు. అదేరోజు ఖవాలీ, భజన కీర్తనలు నిర్వహిస్తారు.

● 20వ తేదీ గురువారం ఫాతేహాలు, దివ్య ఖురాన్ పఠనం చేస్తారు. భక్తులు తీర్థప్రసాదాలు అందజేస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**ముఖ్యఅతిథులుగా పీఠాధిపతులు**

ఉర్సుకు అజ్మీర్ ఖాజ గరీబ్ నవాజ్ దర్గా షరీఫ్ నుంచి వజీర్ హుసేన్, హైదరాబాద్ సయ్యద్ సు ల్తాన్ అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ నిజామొద్దీన్ హుసేని, తాండూర్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్ ఖరీంషా దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ సాబేర్ పాషా, దుప్పల్లి రాంచంద్రయ్య దర్గా పీఠాధిపతులు సుకుమార్ గౌడ్, కరుణాకర్‌గౌడ్, రవిగౌడ్ హాజరు కానున్నారు.

**గులాబీ పూలే ప్రత్యేకం...**

మూడురోజుల పాటు దర్గా ప్రాంతం గులాబీ పూల వాసనతో పులకరిస్తుంది. ఉర్సుకు ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి గులాబీ పూలు, చాదర్(గలీఫా)ను తెప్పిస్తారు.

**దుప్పల్లి పీఠాధిపతితో శిష్యరికం..**

60 ఏళ్ల క్రితం మదనాపురం మండలం దుప్పల్లి గ్రామ పీఠాధి పతి సయ్యద్ అబ్దుల్ రహీం (రాంచంద్రయ్య వద్ద) శిష్యుడిగా చేరిన మాసన్న (అబ్దుల్ రహిమాన్)గా దైవచింతన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించే వారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల నుంచి మన్ననలు పొందారు. ఆయన పరమపదించిన నాటినుంచి ఆయన శిష్యబృందం, దర్గా నిర్వాహకులు ఉర్సును ఘనంగా నిర్వహిస్తున్నారు.

## ఘనంగా మునిరంగస్వామి ఆభరణాల ఊరేగింపు



మునిరంగస్వామి ఆభరణాలను తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**భూత్పూర్:** మండల కేంద్రంలోని మునిరంగ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారి ఆభరణాలను పట్టణంలోని వీధుల గుండా ఊరేగింపుగా దేవాలయం వద్దకు తీసుకెళ్లారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా వంశపారంపర్య ధర్మకర్తలు, మాలధారులు మునిరంగస్వామికి పూజలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం నీటి, వసతి సౌకర్యాలు కల్పించారు. మంగళవారం శకటోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గడ్డం ఎల్లప్ప, బోరంగ్ నర్సింహులు తెలిపారు.

## లింగంపల్లిలో టీబీ వైద్యశిబిరం

**నవాబుపేట:** మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం టీబీ వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ ఆధ్వర్యంలో 137మందికి టీబీ పరీక్షలు చేశారు. అనుమానితులకు ప్రత్యేక పరీక్షలు చేసివారికి ముందు జాగ్రత్త చర్యలుగా మందులు అందించారు. వైద్యసిబ్బంది శరభలింగం, శ్రీనివాస్, రాఘవేందర్, భవానిసింగ్, భాస్కర్, రాఘవేందర్, సంతోష్ ఉన్నారు.

## రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, రైతులు

**చిన్నచింతకుంట:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ముందు ఆపార్టీ ఆధ్వర్యంలో రైతులు ధర్నాను నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయ గోడకు వినతిపత్రం అతికించారు. అనంతరం బీజేపీ జిల్లా నాయకులు సంబిరాజు, కుర్వరమేష్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు రాజ్యం అంటే పదేపదే చెబుతూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో అధికారులను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు శ్రీకృష్ణ, శివాజి, హనుమంతుతో తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా నర్సింగ్‌రావు బాధ్యతల స్వీకరణ



నర్సింగ్‌రావు

**జడ్చర్ల టౌన్:** జడ్చర్ల తహసీల్దార్‌గా నర్సింగ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ సీసీఎల్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. జడ్చర్ల తహసీల్దార్‌గా ఉన్న బ్రహ్మంగౌడ్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

## ‘ఉపాధి’ పనులకు రూ.5.63 కోట్లు ఖర్చు

● సామాజిక తనిఖీలో వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

**భూత్పూర్:** మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు రూ.5.63 కోట్లు ఖర్చు అయినట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగసభకు అదనపు డీఆర్‌డీఓ ముషాయిదా బేగం, అదనపు ప్రాజెక్టు మేనేజర్ మజుల, ఫైనాన్స్ మేనేజర్ (డీఆర్‌డీఏ) మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 2023–24 ఆర్థికసంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా మొక్కలు నాటడం, వాటిని సంరక్షించేందుకు నిధులు కేటాయించగా కొన్నిచోట్ల మొక్కలు నాటినట్లు, నాటి మొక్కలు సంరక్షించుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీరు పోయించినట్లు ఎంబీ రికార్డుల్లో నమోదు చేశారు. ప్రత్యేకంగా అటవీ శాఖ మొక్కల పెంపకం కోసం నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలు పెంచేందుకు రూ.1.47లక్షలు ఖర్చు చేసిందన్నారు. రాత్రి 8గంటలైనా ఇంకా సామాజిక తనిఖీ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఏపీఓ విమల, వివిధ గ్రామాలకు చెందిన గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నిజాలాపూర్‌లో స్వపరిపాలన దినోత్సవం



**అడ్డాకుల:** మూసాపేట మండలం నిజాలాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా సీబీ భవిత, డీఈఓగా అజయ్, ఎంఈఓగా చందు, హెచ్‌ఎంగా మణికంఠ, ఉపాధ్యాయులుగా కృష్ణవేణి, అఖిల, సంగీత, దివ్య, దీపిక, శివలీల, రాధిక, రూప, పూజిత, భవిష్య, రాజేష్, సాయిగణేష్, ప్రవీన్, కుమార్ వ్యవహరించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం బాలకిష్టయ్య, టీచర్లు అరుణ, మాలతి, మన్నెం, మాధవి ఉన్నారు.

# కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ

● ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు
● కేక్‌లు కట్ చేసిన బీఆర్‌ఎస్ నాయకులు
● ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ



జడ్చర్లలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి

**సాక్షి నెట్‌వర్క్:** కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం అవతరించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో రైల్వే స్టేషన్ చౌరస్తాలో కట్ చేశారు. అనంతరం అక్కడే మొక్కలు నాటి అనాథాశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ కేసీ నరసింహులు, మాజీ వైస్‌చైర్మన్ గణేష్, నాయకులు శివరాజ్, రెహమాన్, గిరిధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అనంతరెడ్డి, రామ్‌లక్ష్మణ్, నరేందర్, దేవేందర్‌రెడ్డి, సాయిల్‌యాదవ్, రాజుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సుధాకర్, రామకృష్ణ, శ్రీనివాసులు, జావీద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

● జడ్చర్లలో ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి మొక్కనాటి నీళ్లు పోశారు. భవిత కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. సత్యేశ్వరఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. నేతాజీచౌరస్తాలో కేక్ కట్‌చేశారు. ఏరి యా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు.

● మహమ్మదాబాద్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఘనంగా జరుపుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వెంకట్రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, గీతాపాండు, అశోక్‌రెడ్డి, హన్మంతుగౌడ్, కిష్టయ్య, రంగయ్య, రాజు, బాలాజీ, నీలేష్ పాల్గొన్నారు.

● నవాబుపేటలోని కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, మాజీఎంపీపీ అనంతయ్య, తాహేర్, శ్రీనివాస్, శ్రీనివాస్, చెన్నయ్య, గోపాల్‌గౌడ్, కృష్ణగౌడ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

● అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మూసాపేట కేజీబీవీలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అడ్డాకుల బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మ, తిరుపతిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండయ్య ఉన్నారు.

● మిడ్జిల్ బస్టాండ్ దగ్గర బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి మాజీ సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బాల్‌రెడ్డి, బాలు, పాండు, సుదర్శన్, బంగారు. భీంరాజ్, శేఖర్ ఉన్నారు.

● దేవరకద్రలో కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పాత బస్టాండ్ చౌరస్తాలో, రైల్వేస్టేషన్ బీసీ కాలనీలో వారు కేక్‌లు కట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీకాంత్ యాదవ్, మున్నూర్ బాల్‌రాజు, కరణంరాజు, చల్మారెడ్డి, సత్యం, సయ్యద్‌గౌస్, హన్మిరెడ్డి, యాదయ్య, రవితేజ, భార్గవ్, నవీన్, ఆంజనేయులు, ఊషన్న, జగన్, భాస్కర్‌రెడ్డి, గోపాల్, వెంకటేష్, కొండల్, భరత్‌రెడ్డి, కురుమూర్తి పాల్గొన్నారు.

● భూత్పూర్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పట్టణంలోని చౌరస్తాలో కేక్ కట్‌చేశారు. నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, నరేష్‌గౌడ్, రాములు, వెంకట్రాములు, బ్రహ్మయ్య, తిరుపతయ్య ఉన్నారు.

● రాజాపూర్‌లో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొప్పెరిబచ్చిరెడ్డి, శ్రీశైలంయాదవ్, సత్యయ్య, మల్లేష్ గౌడ్, దేవేందర్ పాల్గొన్నారు.

# ప్రజావాణికి స్పందన కరువాయె



ప్రజావాణిలో ఫిర్యాదుల కోసం వేచి ఉన్న అధికారులు

**దేవరకద్ర:** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. మండల అధికారుల బృందం అంతా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంట వరకు ఫిర్యాదుల కోసం వేచి ఉండగా కేవలం ఒక్క ఫిర్యాదు మాత్రమే వచ్చింది. మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఎదురు చూపులు చూడాల్సి వచ్చింది. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఏఓ రాజేందర్‌అగర్వాల్, ఎంఈఓ బలరాం, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏఈ కీర్తి, హార్టికల్చర్ అధికారి శృతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టి తరలింపు



ఆలయ ప్రాంగణంలో ట్రాక్టర్లతో మట్టి తరలింపు

**చిన్నచింతకుంట:** మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కొందరు అక్రమార్కులు అనుమతుల్లేకుండా అక్రమంగా జేసీబీలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గమనించిన ఆలయ పరిసరాల గ్రామాల ప్రజలు, భక్తులు అక్రమమట్టి తరలింపును నిలిపేయాలని పలువురు మండిపడ్డారు. ఆలయ ప్రాంగణంలో మట్టిని తీయడంతో గుంతలు ఏర్పడి అమవాస్య, బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఈవిషయంపై ఆలయ ఈఓ మదనేశ్వ రెడ్డిని అడగగా ఆలయ ప్రాంగణంలో మట్టిని తీయడం సరైనది కాదని, మట్టి తరలింపుదారులు మట్టిని తీయడం ఆపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అనంతరం వారు మట్టి తరలింపును నిలిపి వేసినట్లు తెలిపారు.

# శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర



అప్పంపల్లి గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

**చిన్నచింతకుంట:** కొకుంట్ల మండలంలోని అప్పంపల్లి గ్రామంలో శివ స్వాములు సోమవారం శ్రీశైలంకు పాదయాత్రగా బయలు దేరారు. నెల రోజుల పాటు కఠినదీక్షలు పూని శివరాత్రి రోజున శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు తరలివెళ్లారు. గ్రామంలో స్వాముల వెంట గ్రామస్తులు భజన, కీర్తనలు ఆలపిస్తూ పుర వీధుల్లో ఊరేగింపుగా ఊరి చివరివరకు సాగనంపారు.

**వాటర్ బాటిళ్ల పంపిణీ**

**దేవరకద్ర:** కాలినడకన శ్రీశైలం వెళ్లే శివస్వాముల దాహార్తిని తీర్చడానికి దేవరకద్రకు చెందిన ఎరుకలి వెంకటేశ్ వెయ్యి వాటర్ బాటిళ్లను అందజేశారు. సోమవారం ఉదయం నుంచి శివస్వాములు పెద్దఎత్తున శ్రీశైలం వెళ్లడానికి దేవరకద్ర మీదుగా వెళ్తున్నారు. వారి దాహార్తిని తీర్చడానికి ఎరుకలి వెంకటేశ్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. శివస్వాముల దాహార్తిని తీరుస్తున్న వెంకటేశ్‌ను పలువురు అభినందించారు.

**శివస్వాములకు ఇరుముడి...**

దేవరకద్ర మండల కేంద్రంలోని శివాలయంలో శివస్వాములకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. నాగభూషణంస్వామి ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శివస్వాములకు ఇరుముడులు వేశారు. ఈ కార్యక్రమానికి శివస్వాములు కుటుంబ సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఇరుముడులు వేసుకున్న శివస్వాములు కాలినడకన శ్రీశైలం మల్లికార్జున స్వామి చెంతకు బయలుదేరి వెళ్లారు.

# ప్రభుత్వ భూమిని సాగుకు అనుమతివ్వాలి



కలెక్టరేట్ వద్ద ఏనుగొండ వాసులు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** ఏనుగొండ శివారులో గల ప్రభుత్వ భూమిని సాగు చేసుకోవడానికి అనుమతివ్వాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ కోరారు. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని ఏనుగొండ రెవెన్యూ వార్డు పరిధిలో గల సర్వేనంబర్ 431లో దాదాపు 20ఎకరాల భూమి ఉందని తెలిపారు. దీన్ని ఏనుగొండకు చెందిన 30 మాదిగ కుటుంబాలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని అన్నారు. గుట్టల మయంగా ఉన్న ఆభూమిని వారి పెద్దలు అనేక కష్టాలు పడి చదును చేసి పంటలు పండించే వారని తెలిపారు. అలాంటి భూమిలో ఫారెస్ట్ అధికారులు కందకాలు తీసి చెట్లు నాటే ప్రయత్నం చేస్తున్నారని, ప్రశ్నిస్తే పోలీస్ కేసులు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహులు, బాలమాసయ్య, తోకల గోపి, నాగమణి, నర్సిములు, రాములు, గద్ద మన్నెం, చెన్నయ్య భాస్కర్, గోపి, మన్నెం, బాలానగయ్య, భూ బాధితులు పాల్గొన్నారు.

# సాంకేతికతను ప్రదర్శించేందుకు అవకాశం



ఎస్‌ఎంఐఎంఎస్‌లో టెక్ ఫియోస్టాలో పాల్గొన్న ప్రముఖులు

**రాజాపూర్:** విద్యార్థుల్లో పరస్పర సహకారం, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఎస్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీ ఒక అద్భుతమైన అవకాశాన్ని అందించిందని ఆయూనివర్సిటీ డీన్ డాక్టర్ కోటేశ్వర్‌రావ్ పేర్కొన్నారు. రెండు రోజులుగా పోలేపల్లి సెజ్‌లోని యూనివర్సిటీలో జరిగిన టెక్ ఫియోస్టా–25 ఇన్నోవేషన్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ వేడుకల్లో 36 గంటల హ్యాకతాన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఎస్‌ఎంషార్క్స్, రోబోరంబుల్ గేమీవర్స్ వంటి వర్క్‌షాప్‌లు అక్కడికి వచ్చిన వివిధ క్యాంప్సుల విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమానికి విశాల్ పెరిఫెరల్ ఓఎస్ ఐబీఎం, మైక్రోసాఫ్ట్, ఎస్‌వీబీడీఐఏ సంస్థల నుంచి ప్రముఖులు హాజరై న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఎస్‌ఎంఐఎంఎస్ వీసీ డా.అభిషేక్‌రంజన్, టీసీఎస్ జీఎం, హెచ్‌ఆర్ శ్రీకాంత్ సూరంపుడి తమ విలువైన సూచనలను అందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులు ప్రదానంచేశారు.

## అసైన్డ్ భూములు కేటాయించాలంటూ ధర్నా

**జడ్చర్ల టౌన్:** రిజిస్ట్రేషన్ చేసుకున్న తమ అసైన్డ్ భూములను తిరిగి తమకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 50మంది రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అసైన్డ్‌భూమికి సంబంధించిన సర్వే నంబర్లతో ఫ్లెక్సీ ప్రదర్శించారు. రైతుల ధర్నాకు మద్దతిచ్చిన ఆల్ ఇండియా సమతపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర మాట్లాడారు. 80ఏళ్ల పాటు సాగుచేసుకున్న 45ఎకరాల భూమిని వ్యాపారసంస్థలు, కార్పొరేట్ వ్యక్తులను పెట్టి అధికారులు రిజిస్ట్రేషన్ చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. అధికారులపై చర్యలు తీసుకోవటంతోపాటు భూమిని తిరిగి రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

**నవాబుపేట:** గ్రామాల్లో పంచాయతీ అధికారులు పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య పనులపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ జయరాంనాయక్ ఆదేశించారు. సోమవారం పంచాయతీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

## బీసీ కాలనీలో చోరీ

**దేవరకద్ర:** స్థానిక బీసీ కాలనీలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆ కాలనీలో నివసించే రాఘవేందర్ కొద్దిరోజులుగా జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. ఇంటికి తాళం ఉండడంతో ఆదివారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని వస్తువులు చిందర వందర చేశారు. అందులో ఉన్న మూడుమాసాల బంగారు కమ్మలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీలో దొంగలు కనిపించినట్లు తెలుస్తున్నది. ఎస్ఐ నాగన్న కేసు నమోదు చేశారు.

## 18, 19తేదీల్లో వామపక్ష పార్టీల నిరసనలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 18, 19వ తేదీల్లో నిరసన చేపడుతున్నట్లు వామపక్ష పార్టీ నాయకులు ఎ.రాములు, బాలకిషన్, సీహెచ్ రాంచందర్ సోమవారం ఒక సంయుక్త ప్రటనలో తెలిపారు. మొదటిరోజు మండల కేంద్రాల్లో, రెండో రోజు జిల్లా కేంద్రంలో జరిగే ఈ నిరసనకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ - మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి - కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల - సి. అంజనేయులు - 80966 88450

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : జి. శివుడు, యాడ్స్ మేనేజర్ - 9951602029

రంజిత్ కుమార్ - 90102 34478
కేశవులు - 90105 22215
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797